ఎదుగుదల లేని శరీరం...సరిగా పనిచేయని జీర్ణ వ్యవస్థ...

సహాయం కోసం హరిజన యువకుడు ఎదురుచూపు

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం దొనకవీధికి చెందిన 15 ఏళ్ళ యువకుడు దొనక ప్రణత్‌కుమార్ శరీర ఎదుగుదల, జీర్ణ వ్యవస్థ సరిగా పని చేయకపోవడం, థైరాయిడ్‌తో సతమతమవుతున్నాడు. ఆరోగ్య శ్రీ ద్వారా ప్రణత్‌కుమార్‌కు ఉన్న వ్యాధికి వైద్యం లేకపోవడంతో తల్లితండ్రులు ఆనందరావు, సుమలత వైద్య సేవలు అందించేందుకు పడే ఇబ్బందులు వర్ణణాతీతం. గతంలో టీడీపీ ప్రభుత్వంలో కెజిహెచ్‌లో వైద్యం అందించారని తర్వాత ఆరోగ్య శ్రీలో వైద్యం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితిలో బ్రతుకు తెరువు కోసం బిడ్డకు వైద్యం కోసం హైదరాబాద్ వలస వెళితే అక్కడ అనుకోని సంఘటనలో ఆరోగ్యవంతుడైన పెద్ద కొడుకు పల్లవ్ కుమార్ చెరువులో పడి మృత్యువాత పడ్డాడని కంటతడి పెడుతున్నారు.

హైదరాబాద్ ఉమ్మడి రాజ ధానిగా ఉన్నంత కాలం ఉస్మానియ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించారని, విభజన తర్వాత విశాఖ కెజిహెచ్‌కు మరలా రిఫర్ చేసారని తెలిపారు. కెజిహెచ్‌లో ప్రభుత్వం నుంచి మంజూరైతే వైద్య సేవలు చేస్తామని చెప్పి పంపారని అన్నారు. ఉన్న ఒకేఒక్క కొడుకు ప్రణత్ కుమార్ వయస్సుకు తగిన శరీరం ఎదుగుదల లేకపోయింది. దీంతో థైరాయిడ్, జీర్ణ వ్యవస్థలో లోపం పుట్టుకతోనే ఎదుగుదలకు అవసరమైన హార్మోన్లు సరైన రీతిలో లేకపోవడంతో తరుచూ ఇన్ఫెక్షన్‌కు గురై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గతంలో మాదిరిగా కూటమి ప్రభుత్వం ఆదుకుని తమ బిడ్డ ఆరోగ్యం సాధారణ స్థితికి వచ్చే విధంగా అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రణత్ తల్లిదండ్రులు సుమలత, ఆనంద్ మొరపెట్టుకున్నారు. అలాగే స్వచ్ఛంద సంస్థలు దాతలు ముందుకు వచ్చి వైద్య సేవలు అందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా లెనిన్ జయంతి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: లెనిన్ పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడుదామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుండంగి లింగరాజు అధ్యక్షతన వి.ఐ లెనిన్ 155వ జయంతి సభ మంగళవారం జరిగింది. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య విఐ లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా పోరాటాలు వర్థిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలి.. అడవులను రక్షించుకోవాలి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి అంటూ నినదించారు. ఈ సందర్భంగా తోట జీవన్న మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో మధ్య భారత అడవుల్లో ఆదివాసులపై సాగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ప్రపంచంలో సామ్రాజ్యం వాదాన్ని వ్యతిరేకించి కార్మిక వర్గ దృక్పథంతో పోరాడి సోషలిస్ట్ విప్లవాన్ని విజయవంతం చేసి, శ్రమజీవుల పాలిట భూలోక స్వర్గాన్ని సృష్టించారని కొనియాడారు. దేశంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గత 11 ఏళ్లుగా ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ, ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మండంగి సింగన్న, గిరిజన యువత పాల్గొన్నారు.

సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ

విశాలాంధ్ర - వీరఘట్టం: మండలంలోని కత్తులు, కవిటీ సచివాలయాన్ని ఎంపీడీవో బి.వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న సర్వేల గురించి ఆరా తీశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రావి రాంబాబు, సచివాలయ సిబ్బంది ఉన్నారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. పనులు చేసి వేతనం గరిష్టంగా 309 రూపాయలు వచ్చే విధంగా పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని క్షేత్ర సహాయకులకు, సాంకేతిక సహాయకులకు ఆదేశించారు. ఆయన వెంట టిఏ వెంకటరమణ ఉన్నారు.

దివ్యాంగుల క్రీడా పోటీలలో దుర్గాప్రసాద్‌కు సిల్వర్ మెడల్

విశాలాంధ్ర - సీతానగరం: విద్యాశాఖ సమగ్ర శిక్షా ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో హీల్ ప్యారడైజ్ స్కూల్ ఆగిరిపల్లి నూజివీడులో రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ 2025 క్రీడాపోటీలు ఈనెల 21 నుడి 23వరకు నిర్వహిస్తున్నారు. ప్రజ్ఞా వైకల్యం, డౌన్ సిండ్రోమ్, మస్తిష్కపక్షవాతం వైకల్యాలు గల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు జరుగు ఈ పోటీలలో మన్యం జిల్లా నుండి ఐదుగురు విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు జరిగిన క్రీడా పోటీలలో బోను దుర్గా ప్రసాద్ 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. దుర్గా ప్రసాద్ సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్న లక్ష్మి, పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర - బలిజిపేట: మండలంలో ఉపాధి పనులకు బిల్లులు చెల్లించాలని, ఉపాధి పనులు చేస్తున్న చోట మౌళిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు యమ్మల మన్మధరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు విస వెంకటస్వామి మాట్లాడుతూ పెద్ద పెంకి గ్రామంలో సుసర్ల బంధలో గత వారం 8 గ్రూపులు సుమారు 300 మంది పనిచేశారని, మస్తర్ పేమెంట్ జనరేట్ చేయకుండా రిజెక్ట్ చేయడం మంచిది కాదని వెంటనే మస్తర్ పేమెంట్ జనరేట్ చేయాలని అన్నారు.

వ్యవసాయ పనులు తగ్గుతున్న నేపథ్యంలో 200 రోజులు ఉపాధి పనులు, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుకూలంగా 600 రూపాయలు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు భారతి, నాగ, లలిత, స్వప్న, ప్రసాదు, కృష్ణవేణి, మరియమ్మ, శాంతమ్మ, తనియేలో రామయ్య ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మే 12 నుంచి నూకాలమ్మ పండగ

విశాలాంధ్ర - పాచిపెంట: మే 12, 13, 14 తేదీలలో జరుపుకుంటున్న నూకాలమ్మ తల్లి పెద్ద పండుగను గ్రామ ప్రజలందరి సహకారంతో విజయవంతం చేసుకుందామని గ్రామ పెద్దలు ఎంపీటీసీ దండి ఏడుకొండలు, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దండి జగన్మోహన్‌రావులు అన్నారు. పాచిపెంట కమ్యూనిటీ హాలులో గ్రామ ప్రజలతో మంగళవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్ల తర్వాత జరుపుకునే ఈ పండుగను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే విద్యుత్, పారిశుద్ధ్యం, త్రాగునీరు వంటి శాఖలతో మాట్లాడడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పాచిపెంట ఉప సర్పంచ్ పి.వెంకటరమణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేటి నుండి జీడి పిక్కలు కొనుగోలు: జేసీ శోభిక

విశాలాంధ్ర - కొమరాడ: డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న వీడీవీకే కేంద్రాల ద్వారా జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలను జాయింట్ కలెక్టర్ శోభిక పరిశీలించారు. మండల ంలోని చోళపదం, అంకుల్ వలసలో జీడి పిక్కల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు పండించే జీడి పిక్కలను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొను గోలు చేయడం జరుగుతుందని తెలి పారు. బుధవారం నుంచి ఆయా కేంద్రా ల్లో జీడిపిక్కలు ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఒక కేజీ జీడి పిక్కలు 155 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఈ అవకాశాన్ని గిరిజన రైతులు సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.శంకర్రావు, వెలుగు ఏపీఎం సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణ ముందస్తు చర్యలపై శిక్షణ

విశాలాంధ్ర - కురుపాం: గిరిజన ప్రాంతాల్లోని గ్రామాల్లో మలేరియా కేసులను సకాలంలో గుర్తించి ప్రాణహాని లేకుండా వైద్య సేవలు అందించాలని జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ కెవిఎస్ ప్రసాద్‌రావు సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో కురుపాం, గుమ్మలక్ష్మీ పురం, జియ్యమ్మవలస మండలాల సీహెచ్‌సీ వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణకు ముందస్తుగా తీసుకోవలసిన చర్యలపై జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ సిబ్బంది వారి పరిధిలో గల గ్రామాల్లో ఎసిఎం స్ప్రేయింగ్ చేయించి ప్రజలకు మలేరియా నివారణపై తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే సమగ్ర సర్వే చేపట్టి మలేరియా కేసులు ఉన్నట్లయితే తక్షణమే వైద్యం అందించి ప్రాణహాని లేకుండా వైద్య సిబ్బంది చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా మలేరియా కన్సల్టెంట్ అధికారి జి.రామచంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి దహన సంస్కారాలు చేసిన కుమార్తెలు

విశాలాంధ్ర - పాలకొండ: పాలకొండ పట్టణంలో హృదయ విదారకర సంఘ టన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పట్టణ పరిధిలో కోమటిపేట వీధిలో నివాసముంటున్న పెద్దపెంకి పద్మవతి (75) వయోభారంతో ఆకస్మి కంగా మృతి చెందారు.

ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే కుమార్తెల భర్తలు గతంలో మృతి చెందారు. వీరికి మగ దక్షత లేక తల్లిని చూసుకుంటూ జీవనం సాగించారు. ఒక కుమార్తె రమ ణకుమారి స్థానిక ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ జీవనం సాగిస్తూ ఉన్నారు. అసలే పేదరికం ఆపై తల్లి మరణంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. స్థానిక శిష్టకరణ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్ భాసూరు కాంతా రావు విషయం తెలుసుకుని అంత్యక్రియలకు స్వర్గ రథాన్ని ఏర్పాటు చేశారు. మగ దక్షత లేక కుమార్తెలే తల్లికి అంత్యక్రియలు చేశారు. వీరికి శిష్టకరణ సంక్షేమ సంఘం ప్రతినిధులు సాహిని శ్రీనివాసరావు, మండకురిటి ఖాళీ ప్రసాదరావు, భగ్గం సురేంద్ర, లఖానాపురం మురళీకృష్ణ, బగ్గం గోపాలకృష్ణ, కార్తీక్ తదితరులు తమ వంతుగా సహాయ సహకారాలు అందించారు.

పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలో గల అన్ని వార్డుల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. మంగళవారం ఉదయం గుడ్ మార్నింగ్ పార్వతీపురం కార్యక్ర మాన్ని పున: ప్రారంభిం చారు. ఇందులో భాగంగా 9, 10 వార్డుల్లో ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ శానిటేషన్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు పర్యటించారు. ఆయా వార్డుల ప్రజలు ఎమ్మెల్యే విజయ్ చంద్ర కు పలు సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 9, 10 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో అపారిశుధ్యాన్ని నివారించడానికి చర్యలు చేపడతామ న్నారు. మున్సిపాలిటీలో 30ఏళ్ళ క్రితం నిర్మించిన కాలువల్లోనే శానిటేషన్ జరుగుతుందని, నూతన కాలువలు నిర్మించి అపారిశుధ్యాన్ని నిర్మూలిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, డిఈ శ్రీనివాసరాజులు, శానిటరీ ఇన్స్పెక్టర్, కెవిపి రాజు, పాలకవర్గ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు గిరిజన ఉద్యోగులే బినామీలు...!

గిరిజనేతరుడా నా పేరిట స్థలం కొనుక్కో ఇల్లు కట్టుకో...!
- అమలుకు నోచుకోని 1/70 చట్టం

విశాలాంధ్ర - పాడేరు: పాడేరులో గిరిజనేతరులకు గిరిజనులు, గిరిజన ఉద్యోగులే బినామీలుగా వ్యవహ రిస్తున్నారు. తమకున్న స్థలాలు తమ పేరిట కొనుగోలు చేసి ఇల్లు కట్టుకోండని వీరే సలహాలు ఇస్తూ 1/70 చట్టాన్ని అమలుకు నోచుకోలేకుండా చేస్తున్నారు. అందుకే గిరిజన ప్రాంతంలో గిరిజన హక్కులు, చట్టాలను రెవిన్యూ, పంచాయతీ అధికారులు కాల రాస్తున్నారు. గిరిజనేతరుడా నా స్థలం కొనుక్కో ఇల్లు కట్టుకో నేనే బినామీ నువ్వు ఎవరికి భయ పడాల్సిన అవసరం లేదు, ఎవరికి ముడుపులు ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నీ నేను చూసు కుంటా అంటూ పట్టణంలో బడా బాబుల వ్యవహారం కొనసాగుతుంది. మరో విశేషం ఏమిటంటే పాడేరు పట్టణానికి చెందిన ఓ గిరిజన ఉపాధ్యాయ ఉద్యోగి బినామీగా అవతారం ఎత్తి ఒక ప్రాంతానికి నేనే రాజు, నేనే మంత్రి అన్నట్లు వ్యహరిస్తున్నదంటే ఎంత బరి తెగించాడో అర్థం చేసుకోవచ్చు....? మరి గిరిజనేతరుల వద్ద ఎంత మొత్తంలో డబ్బు అక్రమార్జన చేసి సంపాదించాడో లెక్కలు వేయాల్సిన పని లేదనుకుంటా... ఈ తంతు రెవిన్యూ, పంచాయతీ అధికారులు తెలిసి నిరోధించక పోవడం కొసమెరుపు. ఓ పక్క పట్టణమంతా ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. మరోవైపు రాజకీయ, డబ్బు బలమున్న బడా బాబుల బినామీ వ్యవహారంతో గిరిజనేతరులు నేడు ఏలుతున్న పరిస్థితి నెలకొంది. ఇదంతా తెలిసిన రెవెన్యూ పంచాయతీ అధికారులు ఏమి చేయలేక వారికి దాసోహం అయిపోయి వారిచ్చే కాసులకు కక్కుర్తి పడే పరి స్థితి దాపురించింది. అధికారులు వారు విధులు సక్రమంగా నిర్వహిస్తే బినామీ వ్యవస్థతోపాటు కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, గిరిజనేతరులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టకుండా కాపాడి 1/70 భూ బదలాయింపు చట్టాన్ని తుంగలో తొక్కకుండా కాపాడగలరు. అధికారులు కూడా అధికారం డబ్బు ఉన్నోడికి ఓ లెక్క అధికారం డబ్బులేనోడికి మరో లెక్క అనేలా పని చేస్తున్నారు. అంటే పేదోడికి ఒక న్యాయం పెద్దవాడికి ఒక న్యాయం అన్న చందంగా పాడేరు పట్టణంలో రెవెన్యూ పంచాయతీ అధికారుల

వ్యవహారం కొనసాగుతుంది. తప్పు చిన్నోడు చేసినా పెద్దోడు చేసినా శిక్ష తప్పుతుందా కానీ ఇక్కడ డబ్బున్నోడు అధికారం ఉన్నోడు తప్పు చేస్తే అసలు అది తప్పే కాదు అన్నచందాన అధికారుల తీరు ఉంది. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు బినామీ వ్యవస్థతోపాటు అక్రమాలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు శాశ్వతంగా గిరిజనేతరులు నిర్మించుకుంటున్న గృహాలపై కేసులు నమోదు చేసి 1/70 భూ బదలాయింపు చట్టాన్ని కాపాడగలరని గిరిజన మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు ప్రజలు కోరుతున్నారు.

చట్రాపల్లి, తోకరాయి గ్రామాల బాధితులతో కలెక్టర్ ముఖాముఖి

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలోని జలప్రళయానికి నివాస స్థలాలు కోల్పోయిన చట్రాపల్లి, తోకరాయి బాధిత గ్రామాల ప్రజలతో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ముఖా ముఖి నిర్వహించారు. తోక రాయిలో గ్రామ సభ నిర్వహించారు. తోకరాయి ప్రాంతంలో పోడు వ్యవసాయం చేస్తున్నారని అది పర్యావరణానికి మంచిది కాదని, దీనివలన వరదలు వచ్చి ప్రమాదాలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. స్థానిక తహశీల్దార్‌కు ఆ విధంగా ఏవరైన పోడు వ్యవసాయం చేసినట్టు అయితే చర్యలు తీసుకోమని ఆదేశించారు. ఈ సందర్భంగా డి పట్టాదారులను రెచ్చగొడుతున్న కొందరు పేర్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ వేసి తహశీల్దార్, ఎంపీడీఓ, ఎస్‌హెచ్‌ఓ కలిసి ప్రజా ప్రయో జనాల కార్యక్రమాలని అడ్డుకునే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.రామకృష్ణ, ఆర్.ఐ, సర్వేయర్, ఇంజనీరింగ్ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శబరి నదిలో యువకుల మృతదేహాలు లభ్యం

విశాలాంధ్ర - సీలేరు/చింతూరు: సీలేరు నదిలో విహారయాత్రకు వెళ్లి నీటిలో గల్లంతైన నాగులపల్లి దిలీప్, శ్రీనివాసుల మృతదేహాలు మూడు రోజుల తర్వాత గుర్తు పట్టని విధంగా శబరి నదిలో లభ్యమయ్యాయి. ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీసు బృందాలు మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. కడసారి చూపు కోసం కన్నవారు ఆత్మీయులు స్నేహితులకు మంగళవారం ఉదయం విగత జీవులుగా శబరి నదిలో యువకుల మృతదేహాలు దర్శనం ఇవ్వడంతో ఒక్కసారిగా రోధనలు మిన్నంటాయి. రెండు బాధితకుటుంబాల్లో ఒక్కరే మగ సంతానం కావడంతో వారి దుఃఖాన్ని ఆపే ప్రయత్నం ఎవరికి సాధ్య పడలేదు. అనంతరం మృతదేహాలను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మృతి చెందిన యువకుల అంతిమయాత్రలో ఆయు ర్వేద వైద్యులు జమాల్ ఖాన్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ వద్దు స్పెషల్ డీఎస్సీ ముద్దు

ఎంపీపీ బడుగు రమేష్

విశాలాంధ్ర - కొయ్యూరు: కూటమి ప్రభుత్వం అట్టహాసంగా విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌తో గిరిజన యువత నిరుద్యోగులకు తీవ్రంగా నష్టం కలిగిందని ఎంపీపీ బడుగు రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా అరకు ఎన్నికల బహిరంగ సభలో గిరిజన ప్రాంత ప్రజానీకం ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారం చేపడితే జీవో నెంబర్ 3ను పునరుద్ధిస్తామని లేదా ప్రత్యామ్నాయ జీవోను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జీవో నెంబర్ 3ని లేదా ప్రత్యామ్నాయ జీవోను విడుదల చేశాకే ఈ మెగా డీఎస్సీని విడుదల చేయాలని అన్నారు. జిల్లాలో 512 పోస్టులు ఉండగా 1/70 చట్టం ఉన్న ఎస్టీలకు 6శాతం పోస్టులు గిరిజనేతరులకు 94శాతం పోస్టులు ఇవ్వడమా? ఇదెక్కడి న్యాయం అని అన్నారు. తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ రద్దుచేసి జీవో నెంబర్ 3 లేదా ప్రత్యామ్నాయం జీవోను అమలు చేయాలని తెలిపారు.

గోమంగి పంచాయతీ సెక్రటరీపై చర్యలు లేనట్టేనా...?

ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ

విశాలాంధ్ర - పెదబయలు: మండలంలో గోమంగి పంచాయతీ సెక్రటరీ మూడు నెలల నుంచి విధులకు దుమ్మా కొడుతున్నారని అయినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ అన్నారు. పంచాయతీ సెక్రటరీ విధులకు హాజరు కావడం లేదని సర్పంచ్, వార్డు మెంబర్లు, పీసా గ్రామ సభ నాయకులు గ్రామ సచివాలయం ముందు ఆందోళన చేయటం, అధికారులకు ఫిర్యాదు చేయటం, పత్రికల్లో వచ్చినా నేటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. పంచాయతీ కార్యదర్శి విధులకు రాకపోవడంతో పుట్టిన ధృవపత్రాలు, మరణ ధ్రువపత్రాలు, కుల, ఆదాయం పత్రాలు జారీ విషయంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆ పంచాయతీ సెక్రటరీపై తక్షణమే చర్యలు తీసుకొని కొత్త సెక్రటరీ ని నియమించాలని డిమాండ్ చేశారు.

మండలంలో వర్షం బీభత్సం

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలంలో మంగళవారం వర్షం భీభత్సం సృష్టించింది. మండలంలోని దుప్పులవాడ సచివాలయం వద్ద పెనుప్రమాదం చోటు చేసుకుంది. తగ్గి ఈశ్వరి అనే మహిళా పోలీస్ చెందిన స్కూటీ విపరీతమైన గాలుల కారణంగా సచివాలయం పక్కనే ఉన్న ఒక పెద్ద జీలుగు చెట్టు కూలిపోవడంతో పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో స్కూటీ ముక్కు ముక్కలుగా శిథిలమైంది. అయితే మహిళా పోలీస్ సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. గుమ్మిరేవుల పంచాయితీలోని మాదిమల్లు సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఒక పెద్ద వృక్షం కూలిపోయింది. దీంతో ప్రయాణికులకు, వాహనాలకు దాదాపు గంటసేపు తీవ్ర అంతరాయం కలిగింది. అలాగే నేలజర్త గ్రామంలో కొర్ర చిరంజీవి అతని ఇంటి పైకప్పులు గాలి వర్షానికి ఎత్తుకుపోవడం జరిగింది. పలుచోట్ల చెట్లు ఇంటి పై కప్పులు ఎత్తుకుపోవడం జరిగింది. జీకేవీధి మండలం దారకొండ సచివాలయం సమీపంలో ఒక పెద్ద చింతచెట్టు కూలిపోయింది. బలమైన ఈదురు గాలుల కారణంగా ఈ ఘటన జరిగింది. చెట్లు పడటంతో మూడు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఈ ప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

సీపీఐ నేత పాంగి ఓలయ్య మృతి

విశాలాంధ్ర - కొయ్యూరు: మండలంలోని సీపీఐ సీనియర్ నాయకులు, కొయ్యూరు మండలం అంతాడ పంచాయతీ కొత్తపల్లి గ్రామం మాజీ ఉపసర్పంచ్ పాంగి ఓలయ్య మంగళవారం మృతి చెందారు. ఓలయ్య మరణం సిపిఐకి తీరని లోటు అని సీపీఐ మండల కార్యదర్శి ఇరవాడ దేవుడు అన్నారు.

ఈదురు గాలులతో కుంభవృష్టి వర్షం

విశాలాంధ్ర - చింతపల్లి: ఈదురు గాలులతో కూడిన కుంభవృష్టి వర్షంతో పాటు వడగండ్ల వాన కురవడంతో చింతపల్లి మన్యం ఒక్కసారిగా చల్లబడింది. వేసవి కాలంలో ఊహించని విధంగా వచ్చిన వడగండ్లతో కూడిన కుంభవృష్టి వర్షం కారణంగా మండలంలో పలుచోట్ల జరుగుతున్న వివాహ, ఇతర శుభకార్యాలు వర్షం వలన కలిగిన ఇబ్బందితో శుభ కార్యాల విందులకు విచ్చేసిన బంధువులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు వర్షం తాకిడికి చెల్లా చెదురయ్యారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని సింగర్భ పంచాయతీ బూరుగువీధి పాఠశాలలోని విద్యార్థులు ఇటీవల ఏకలవ్య పాఠశాల పోటీ పరీక్షల్లో సీట్లు సాధించినందుకు ప్రధానోపాధ్యాయుడు మత్స్యరాస మత్స్యరాజును విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయుడు డి. కృష్ణమూర్తితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని మంగళవారం కురిసిన భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఎన్.కొత్తూరు సమీపంలో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో కొంత సమయం వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కాగా నుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామంలో తల్లె పెద్దమ్మి అనే గిరిజనురాలు ఇల్లుపై రేకులు నేలకూలాయి. అలాగే మంగళవారం వారపు సంత కావడంతో కురిసిన భారీ వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మండలంలో పోషణ పక్వాడ

విశాలాంధ్ర జీ కే వీధి: ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ లెవెల్‌లో మంగళవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు గర్భిణులు, బాలింతలు, రెండు సంవత్సరాల లోపు పిల్లల తల్లులకు వెయ్యి రోజులు తీసుకోవాల్సిన పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ యొక్క పునాది దశ అయిన మొదటి వెయ్యి రోజులు సంరక్షణ బాగుంటే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. అదే విధంగా బాల్య వివాహాలు చేసుకోవడం, టీనేజ్ ప్రెగ్నెన్సీ వలన కలిగే అనర్థాలు గురించి వివరించారు. ఇందులో భాగంగా గర్భిణీలకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు డి.వలసమ్మ, డి.మోహిని, కె.రామలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు ధృవీకరణ పత్రాలు అందజేయడం సంతోషంగా ఉందని తాజంగి కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ వసతి గృహ విద్యాలయం ఎస్ఓ కే.సుమ మాధురి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ తమ విద్యాలయం విద్యార్థినిలు వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్నారన్నారు. 10, 11 తరగతి విద్యార్థులకు తాజంగి గ్రామంలో వున్న గ్రామ సచివాలయం వద్ద గడచిన 10 రోజులుగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఎం.నీలిమ శిక్షణ ఇచ్చారని ఆమె వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం విద్యార్థినీలకు మంగళవారం ధృవీకరణ పత్రాలు అందజేయడం జరిగిందని ఆమె వివరించారు.

ఐటీడీఏ ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నా

విశాలాంధ్ర - పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో రాష్ట్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ యూనియన్ పిలుపుమేరకు తమ సమస్యలు పరిష్కారం చేయాలని ఐటిడిఏ కార్యాలయం ఎదురుగా అల్లూరి జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ యూనియన్ నాయకురాలు దుర్గ భవాని ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యగ భద్రత కల్పించాలని,ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్దీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గణేష్, అల్లూరి జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలు ద్వారా ప్రకృతి వ్యవసాయం

విశాలాంధ్ర - కురుపాం: రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయం జరగాలని వ్యవసాయ విభాగ డిపిఎం షణ్ముఖరాజు అన్నారు. మంగళవారం గల రైతు భరోసా కేంద్రం వద్ద వివోఓ లకు, విఎఎ లకు, గ్రామ సంఘ లీడర్లకు, ఏపీ సీఎన్ఎఫ్, మండల అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయం నవధాన్యాలు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగు వలన కలిగినటువంటి లాభాలు గూర్చి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయానికే రైతులు మగ్గు చూపేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జట్టు వ్యవస్థాపకులు డి .పారి నాయుడు, వ్యవసాయ శాఖ ఏడిఏ నిర్మల జ్యోతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు ముస్తాబైన చింతపల్లి

విశాలాంధ్ర - చింతపల్లి: ఈనెల 24 నుంచి 27 వరకు చింతపల్లిలో జరగనున్న ముత్యాలమ్మ జాతరకు సంబంధించిన సందడి మొదలైంది. ఈ జాతర సందర్భంగా గ్రామమంతా విద్యుత్ అలంకరణలతో శోభాయమానంగా తయారైంది. రంగురంగుల విద్యుత్ దీప కాంతులు, ఆకర్షణీయమైన డెకరేషన్లతో గ్రామం లోని వీధులన్ని కళకళలాడుతున్నాయి. భక్తుల సందడితో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత కచేరీలు జాతరకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ముత్యాలమ్మ జాతరకు సమీప గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు హాజరవుతారన్న ముందస్తు జాగ్రత్తల నేపద్యంలో పోలీసు లు అప్రమత్తం అయ్యారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హెూమాలు ఘనంగా జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఏ ఎస్ పి నవజ్యోతి మిశ్రా ఆదేశాల మేరకు స్థానిక సీ ఐ ఎం వినోద్ బాబు, ఎస్సై లు వెంకటేశ్వర రావు, వెంకట రమణలు ఇప్పటికే అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. జాతర సందర్భంగా వ్యాపారులు, వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేసి, స్వీట్లు, బొమ్మలు, గాజులు, బట్టలు వంటి వస్తువులను విక్రయిస్తున్నారు. ఈ ఏడాది జాతరను మరింత విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాతర సజావుగా సాగేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఆలయ పరిసరాలు, గ్రామ వీధుల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలను నియమించగా, భక్తుల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాల సహాయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.స్థానిక ఏ ఎస్పీ నవజ్యోతి మిశ్రా మాట్లాడుతూ, "జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్ధం భద్ర తకు ఎలాంటి లోటు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు ఎలాంటి ఆందోళన లేకుండా దైవ దర్శనం చేసుకోవచ్చన్నారు. జాతరకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవలసిన బాధ్యత అటు ఉత్సవ కమిటీ, ఇటు పోలీసులతోపాటు స్థానిక ప్రజలపై కూడా ఉందని ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఆయన సూచించారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక సీఐ ఎం వినోద్ బాబు, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య ఉత్సవ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు దురియా హేమంత్ కుమార్, పసుపులేటి వినాయకరావు, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఊరూరా కళాజాత బృందం
స్వచ్ఛ సంకల్పంపై కార్యక్రమాలు

విశాలాంధ్ర - సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ సంకల్పం గ్రామీణ పారిశుద్యం అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని కొత్తవలస గ్రామంలో మంగళవారం స్వచ్ సంకల్పం విషయాలపై ఆరోగ్య కళాజాత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ రెడ్డి అనిత అప్పలనాయుడు పాల్గొన్నారు. కళాజాత బృందం గ్రామాల్లో వ్యక్తి గత పరిశుభ్రత, మురికి నీటి నిర్వహణ, బహిరంగ మల విసర్జన నిషేధం, తడి పొడి చెత్త నివారణ, సామూహిక ప్రదేశాల్లో పారిశుద్ధం వంటి అంశాలలో పరిమాణాత్మక, గుణాత్మక విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ రెడ్డి అనిత, మాజీ సర్పంచ్ వాసుదేవరావు హాజరయ్యారు. సర్పంచ్ అనిత మాట్లాడుతూ మన ఊరి పరిశుభ్రత మన అందరి బాధ్యత గా భావించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వివిధ అంశాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ గ్రామాలలో బహిరంగ మలమూత్ర విసర్జనారహిత గ్రామంగా తీర్చిదిద్దటానికి మరుగుదొడ్డి వాడకం, ప్లాస్టిక్ రహిత జీవనం,ప్లాసిక్ వ్యర్ధాల నిర్మూలన మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం సెక్రెటరీ సూర్య ప్రకాష్,ఆశా వర్కర్లు, ఎఎన్ఎం సుమ, గ్రామపంచాయితి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా బగ్గం దొరవలసలో కూడా కళాజాత బృందాలు ఉపాధిహామీ పథకం వేతనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరావు, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాల్లో గ్రామసభలు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చింతూరు పోలవరం ముంపునకు గురి అవుతున్న వి.ఆర్.పురం చింతూరు మండలాల్లో ఉన్న ఆరు గ్రామాల్లో మంగళవారం ఆర్ అండ్ ఆర్ గ్రామ సభలు నిర్వహించారు. మొదట ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు వారు ఏజి కోడేరు, అడవి వెంకన్న గూడెం, ప్రతిపాక, గుండు గూడెం, రామవరం, రామవరం పాడు గ్రామాల్లో గ్రామ సభలకు హాజరై నిర్వాసితుల జాబితాను గ్రామ సభలో చదివి వినిపించడం జరిగింది. . ఈ ఆరు గ్రామాల్లో మొత్తం 1753 పిడిఎఫ్‌లు ఉండగా 1605 మంది అర్హులుగా గుర్తించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ అండ్ ఆర్ కమిషనర్‌ను కలిసిన పోలవరం నిర్వాసితులు

విశాలాంధ్ర - కూనవరం: అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ రామ్ సుందర్ రెడ్డిని కలిసి మంత్రి పోచవరం కాచవరం పంచాయతీలను 41.15 కాంటూరులో చేర్చాలని వినతి అందించారు. కమిషనర్ వెంటనే వినతిని ఎండార్స్ చేసి ఈ గ్రామ పంచాయతీలను మొదటి కాంటూరు 41.15 లో చేర్చాలని ఆర్ అండ్ ఆర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌తో ఫోన్‌లో మాట్లాడి లెటర్ పంపడం జరిగింది. అదేవిధంగా ఇరిగేషన్ ఆర్ అండ్ ఆర్ శాఖలతో మీటింగ్ ఏర్పాటు చేయిస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, చంద్రుగొండ, ఏడుకొండలు, గారపాటి రాంబాబు, షేక్ సుభాని, కొయ్యల బుచ్చిరాజు, సంతపురి చిన్న వెంకటేశ్వర్లు, కుచ్చర్ల పాటి ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ వృత్తి విద్యలో ఇంటర్న్‌షిప్

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మండలం పెదబొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో భాగంగా 10రోజుల పాటు ఫుడ్ ప్రాసెసింగ్ వృత్తి విద్యలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న 24 మంది విద్యార్థులు సమగ్ర శిక్ష జిసిడిఓ ఎస్.మధుకిషోర్, హెచ్ఎం ఐ.గౌరీ చేతుల మీదగా సర్టిఫికెట్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విసిలు అప్పలనాయుడు, వాసు, వి.టిలు అనూష, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్కిల్స్‌ని పెంపొందించే విధంగా విద్యార్థులు వారి పరిసరాలలో దగ్గర్లో ఉన్న బేకరీకి తీసుకువెళ్లి వివిధ రకములైన ఐటమ్స్ నేర్పించడం జరిగింది.

ఎమ్మెల్యే చేతుల మీదుగా ధ్రువపత్రాల పంపిణీ

విశాలాంధ్ర - రంపచోడవరం: సమగ్ర శిక్ష అభియాన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సీతపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకి చెందిన విద్యార్థులకు 2024 - 25 విద్యా సంవత్సరంలో జరిగిన ఇంటర్న్ షిప్ శిక్షణలో భాగంగా అపీరియల్, బ్యూటీ, వెల్నెస్ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినిలకు రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష బాస్కర్ చేతుల మీదుగా ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో సుమశ్రీకి రెండవ ర్యాంకు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం బీసీ కాలనీకి చెందిన శివ సాయి ప్రసాద్, విజయలక్ష్మి దంపతుల కుమార్తె సుమశ్రీ తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటలోని వి కె డి వి ఎస్ రాజు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుంది. మొదటి సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలోనే రెండవ ర్యాంక్ 437/440 మార్కులు సాధించింది. ఇప్పుడు ఇంటర్ రెండవ సంవత్సరంలో మొత్తం మార్కులు 989/1000 మార్కులు సాధించి మరల తెలంగాణ రాష్ట్రంలో రెండవ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. ఈ చదువుల సరస్వతి లక్ష్యం డాక్టర్ కావడం. ఈమె అత్యుత్తమ ర్యాంకుతో ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని పుర ప్రముఖులు గ్రామ పెద్దలు పలువురు ప్రశంసించారు.

సెలవులు ఇవ్వకుండానే విద్యార్థులు ఇంటికి...

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో అనధికారికంగా ముందస్తుగా వేసవి సెలవులు ఇచ్చేస్తున్నారని, మూడు రోజులు ముందుగానే విద్యార్థులను ఇళ్లకు పంపించడంతో సంక్షేమ వసతి గృహాలు ఖాళీ అవుతున్నాయని, వాస్తవానికి ప్రభుత్వం ఈనెల 23 వరకు పాఠశాలలు పని చేయాలని 24 నుంచి సెలవులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిందని మన్యం జిల్లాలోని కొన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులను శనివారం సాయంత్రం నుంచే ఇళ్లకు పంపించడం ప్రారంభించారని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్ల సురేష్ అన్నారు. వసతి గృహాల నుంచి పుస్తకాలు పెట్టెలు దుస్తులు వివిధ వస్తువులు సర్దుకుని ఇంటికి వెళ్తున్నారని, తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్తున్నారనే సాకులతో పాఠశాల సిబ్బంది పిల్లలను పంపించేస్తున్నారని పాఠశాల వసతి గృహాలలో విద్యార్థిని విద్యార్థులు మూడురోజుల ముందే ఇంటికి చేరడంతో కొన్ని పాఠశాలలో విద్యార్థులు ఉన్నట్లు హాజరు పట్టికలో వేస్తున్నారని తెలుస్తోందని దీనిపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్ల సురేష్ తదితరులు కోరుతున్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసమే "వెయ్యి రోజుల" కార్యక్రమం
గర్భిణులకు 1000 రోజులు చాలా ప్రాముఖ్యం
శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి

విశాలాంధ్ర - చింతపల్లి: ఆరోగ్యవంతమైన సమాజం కోసమే అంగన్వాడీల ద్వారా వెయ్యి రోజుల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ పక్వాడ) కార్యక్రమంపై మంగళవారం ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన మహిళలకు 1000 రోజులు ఎంతో ప్రాముఖ్యమైనవని, గర్భం దాల్చిన మహిళలు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా వారు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అంగన్వాడి కార్యకర్తలతో పాటు, గర్భం దాల్చిన మహిళలు, బాలింతలకు వెయ్యి రోజుల ప్రాముఖ్యత, శిశువుల సంరక్షణపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశంగా సాగిందన్నారు.

చిన్మయిదేవి (ఫైల్‌ఫోటో)

చూపరులను ఆకర్షించే "మే" పుష్పం

విశాలాంధ్ర - చింతపల్లి: మన్య ప్రాంతంలో ఏడాదికి ఒకసారి మాత్రమే వికసించే/ కనిపించే మే పుష్పం ఎండలు మెండుగా కాయడంతో ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే పుష్పించాయి. ఇవి చూడటానికి అందంగా గుండ్రని ఆకారంతో బంతిలా కనిపిస్తూ చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.. దీంతో ఈ పుష్పాలను చూసినవారు, చూసిందే తడవుగా దీని అందానికి ఆఖరి స్థితులు అవుతున్నారు. దీని వివరాలను పరిశీలిస్తే :మన్య ప్రాంతంలో కనిపించే పుష్పాలలో మే ఫ్లవర్ ఒకటి. దీనిని ఫుట్ బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ (స్కాన్డాక్సిస్ మల్టీ ఫ్లవర్స్) చూడ్డానికి ఎర్రని బంతిలా, చూపరులను ఆకట్టుకొనేలా ఉంటుంది. మే నెలలో మాత్రమే వికసించటంతో దీనికి "మే పుష్పం" అని పేరు వచ్చింది. ఈ పుష్పాలు అందంగా ఉండడంతో మన్యవాసులు ఈ పుష్పాలను గృహాల ముందు, ఇంటి పరిసరాలలో ఎక్కువగా పెంచేందుకు ఇష్టపడతారు. ఈ పుష్పాలు ఏడాదికి ఒకసారి మాత్రమే కనిపిస్తుంది. ఈ మేరకు సాధారణంగా ఎండలు విపరీతంగా ఉన్నప్పుడు అంటే ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే ఈ పుష్పం పూస్తుంది. కనుకనే దీనిని మే పువ్వు లేదా మే పుష్పం, మే ఫ్లవర్‌గా పిలుస్తారు. ఇది లిల్లీ జాతికి చెందిన దుంప రకం మొక్క. ఒక్కసారి నేలలో పాతితే అది చనిపోవడం అంటూ ఉండదు. నెమ్మదిగా పిలకలు వేస్తూ విస్తరిస్తూనే ఉంటుంది. ఎంత వేడిగా ఉంటే అంతగా ఇది పూలతో వికసిస్తుంది. మే ఫ్లవర్ వికసించడానికి మొగ్గ పువ్వుగా విచ్చుకోవడానికి సుమారు ఇరవై రోజులు సమయం పడుతుంది. ఒకటిన్నర నుంచి రెండడుగుల వరకు ఎత్తు ఉండే ఈ మొక్క తక్కిన కాలం అంతా పచ్చని వెడల్పాటి ఆకులతో అలరిస్తుంది. అందుకే దీనిని ల్యాండ్ స్కేపుల్లో అంచులకు వాడతారు. దీనిని బొకేలలో వాడరు. కానీ కట్ ఫ్లవర్ మాదిరిగా ఫ్లవర్ వాజ్ లో పెట్టుకోవడానికి చాలా బాగుంటుంది. ఈ పుష్పం దుంపకు ఒక పువ్వు మాత్రమే పూస్తుంది. ఎన్ని పువ్వులు కావాలంటే అన్ని దుంపలు నాటుకోవాల్సిందే. దీనికుండే మరో ప్రత్యేకత ఏమిటంటే దుంపలు ఎంత పాతవయితే పువ్వు పరిమాణం అంతగా పెరుగుతూ వస్తుంది. అంటే మొదటి ఏడాది చిన్న బంతిలా పూస్తే రెండు మూడేళ్ల తర్వాత పెద్ద పెద్ద పూలతో వికసిస్తుంది. ప్రతి ఏడాది దీని పరిమాణం పెరుగుతుంది. ఇసుక నేలల్లోఈ పుష్పాలు బాగా పెరుగుతుంది.రోజులో ఎండ నాలుగు గంటలు పాటు ఉండాలి. కట్ ఫ్లవర్‌గా అలంక రించుకొంటే పొడవాటి ఫ్లవర్ వాజులలో దీనిని ఉపయో గించుతారు. కట్ చేసిన ఈ పుష్పాలు, అలంకరణ కోసం ఫ్లవర్ వాజ్‌లలో ఉంచినట్లయితే వారం నుంచి పది రోజుల వరకు వాడిపోకుండా, అందంగా ఉంటాయి..

ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి: సీఐ వినోద్‌బాబు



విశాలాంధ్ర - చింతపల్లి: చింతపల్లి గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో భక్తులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసు శాఖ ద్వారా తీసుకున్న ట్రాఫిక్ నియమ, నిబంధనలను స్థానిక ప్రజలతో పాటు, జాతరకు వచ్చే భక్తులు విధిగా పాటించాలని స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వినోద్ బాబు అన్నారు. స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా ఆదేశాలు, సూచనలతో జాతరలో తీసుకోవలసిన జాగ్రత్తల మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 వ తేదీ నుంచి 27 వరకు జరుగనున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు, ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలిగించవద్దని కోరారు. ఈ మేరకు నర్సీపట్నం -లంబసింగి మీదుగా చింతపల్లి వైపు నుండి వచ్చే వాహనాలకు స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల ఆవరణ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీలేరు, పెదవలస అంతర్ల వైపు నుండి వచ్చే వాహనాలకు భక్తుల సౌకర్యార్థం జిల్లా పరిషత్ అతిథి గృహం సమీపంలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా పాడేరు - అన్నవరం - చౌడుపల్లి వైపు మీదుగా చింతపల్లి వైపు వచ్చే భక్తుల నిమిత్తం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వద్ద పార్కింగ్‌కు కేటాయించడం జరిగిందన్నారు. జాతర సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలు ఈ నెల24 వ తేది నుండి 27 వరకు స్థానిక టీ జంక్షన్ నుండి డిగ్రీ కాలేజీ వరకు గల ప్రధాన రహదారిపై వాహనాలను నిర్లక్ష్యంగా నిలపరాదన్నారు. జాతర సందర్భంగా ఏవైనా సమస్యలు ఉత్పన్నమైనప్పుడు, ఈ క్రింది పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్: 112, అదే విధంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ 9440904238, సి ఐ 9440904239, అదనపు ఎస్ ఐ 94941 57957 మొబైల్ నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

4 నెలలుగా అందని మంచినీరు పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం దూసరిపాము గ్రామంలో కొత్తవీధి కాలనీ వాసులు నాలుగు నెలలుగా మంచినీరు అందక ఇక్కట్లు పడుతున్నారు. గత నాలుగు నెలలుగా నీరు రావడం లేదని, అధికారులకు, పంచాయితీ సర్పంచ్‌కి, వార్డు మెంబర్‌కి తెలియజేసినా ఎటువంటి ఉపయోగం లేదని తెలిపారు. ఎండాకాలం కావడంతో నీటి కొరకు చాలా కష్టాలు పడుతున్నామని, సుదూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకొంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి కష్టాలు తీర్చాలని కోరారు.

వాయుపుత్ర చలివేంద్రం ప్రారంభం



విశాలాంధ్ర - కురుపాం: వాయుపుత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో దుర్గగుడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీనియర్ జర్నలిస్ట్ నెల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చడానికి కూల్ మినరల్ వాటర్ కోటదుర్గమ్మ ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని, దాతలు ముందుకు వచ్చి మరిన్ని చలివేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాయుపుత్ర సేవా సంఘ అధ్యక్షుడు బోటు అనీల్ కుమార్, సభ్యులు గుడ్ల సాగర్, బోటు మణికంత, పొట్నూరు శబరీష్, బోటు అనిల్ కుమార్, నెమలిపురి లక్ష్మణ్, ఢిల్లీ శ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను తప్పు పట్టడం సరికాదు
సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు కృష్ణమూర్తి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: రాజకీయ ఒత్తిడి కారణంగానే రెవెన్యూ అధికారులు, పోలీసులు నిర్వాసితుల భూములపై బుల్డోజరుతో దాడి చేసి, కమ్యూనిస్టులను తప్పు పట్టడం సరైన పద్ధతి కాదని సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనంలో పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం బంటువానివలస గ్రామంపై నిర్వాసితులు నిర్మించుకున్న గోడలను చెట్లను చాలా అధ్వానంగా మండల తహసిల్దార్, పోలీసు యంత్రాంగం పూర్తిగా కూల్చివేసిన సంగతి అందరికీ తెలిసినదేనని, దానిని అడ్డుకునే ప్రయత్నం చేసిన నిర్వాసితులపై 107 కేసులు కూడా పెట్టడం జరిగిందని తెలిపారు. ఆ దాడిని ఖండిస్తూ సోమవారం భూ నిర్వాసితులందరూ కలెక్టర్ ఆఫీసు వద్దకు వెళ్లి విన్నవించుకున్న విషయం తెలిసినదే. జాయింట్ కలెక్టర్ బయటికి వచ్చి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని హామీ కూడా ఇచ్చారని, నిర్వాసితుల భూమి కూల్చివేతపై ఎమ్మెల్యే పాత్ర ఉన్నదా లేదా అనేది ఎమ్మెల్యే ఖండించాల్సింది పోయి, ఒక సాధారణమైన వ్యక్తి ఖండించడమంటే ఆ వ్యక్తికి, అధికారులకు ఆత్మరక్షణకు మరో మార్గంలో బాగమేనని వివరించారు. అసలు అధికారులు ఆదివారం అయినప్పటికీ హుటా హుటిన నిర్వాసితుల నిర్మాణం కూల్చివేతకు అంత ఉత్సాహం వెనుక కారణం ఏమిటి, ఏ ఒక్క వ్యక్తి ఒత్తిడి లేకుండానే అధికారులు, పోలీసులు ఈ దారుణానికి పాల్పడ్డారా అని అన్నారు. దేవునిబంధ, వరహాలగెడ్డ ఇలా అనేక రకాల గెడ్డలు మొత్తం కబ్జాలకు గురైన విషయం అధికారులకు తెలియదా, లేక రాజకీయ హస్తం ఉందన్న కారణంగా విడిచి పెట్టేశారా అని ప్రశ్నించారు. బంటువానివలసలో నిర్వాసితుల భూమి ఒక వ్యక్తి చెప్పినట్టు కబ్జాకు గురైనట్లయితే, ఆనాటి ఎమ్మార్వో అధికారికంగా ఏ విధంగా పట్టాలను జారీ చేయగలరు, అది అబద్ధం అని రుజువు చేయగలిగితే, తోటపల్లి నిర్వాసితులకు ఇచ్చిన పట్టాలన్నీ కూడా అబద్ధమేన మరీ, దీనికి రాజకీయ అధికార నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాజకీయ నాయకుల కుట్రలను బట్టబయలు చేయాలని, రాజకీయ మోసపు మాటలకు బలికావద్దని విజ్ఞప్తి చేశారు.

చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించిన జిల్లా గ్రామ పంచాయితీ అధికారి

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీలోని చెత్త సంపద కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు మంగళవారం సందర్శించారు. కేంద్రం నిర్వహణ తదితర అంశాలను చర్చించారు. తడిచెత్త, పొడి చెత్తన వేరువేరుగా వసూలు చేసి వాటిని ఎరువులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఉదయం పూట పిఆర్ వన్ యాప్, డైలీ గార్బేజ్ కలెక్షన్, డైలీ క్లోరినేషన్ తదితరాలను వివరించారు. వివరాలను పిఆర్ వన్ యాప్లో కేవలం ఐదు నిముషాలలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా డివిజనల్ పంచాయతీ అధికారి ఎం నాగభూషణం సూరంపేట, కాశాపేట గ్రామ పంచాయితీలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు మురళి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి

విశాలాంధ్ర - వై.రామవరం: అల్లూరి జిల్లా వై.రామవరం నుండి గుర్తేడు వరకు ఏళ్ల తరబడి నిలిచిపోయి ఉన్న రోడ్డు నిర్మాణం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని మంగళవారం గుర్తేడు పర్యటనకు వచ్చిన అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు మండల టీడీపీ అధ్యక్షుడు పల్లాల రమణా రెడ్డి, పలువురు గిరిజనులు వినతి పత్రం అందజేశారు. ఫారెస్టు క్లియరెన్సు సాకుతో రోడ్డు నిర్మాణం ఆపేశారని తెలిపారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ నెల రోజుల్లో పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.